క్లుప్తంగా

దేవాలయ అభివృద్ధికి విరాళం



ఆలయ నిర్వాహకులకు విరాళం అందజేస్తున్న అరుంధతి

షాద్‌నగర్: పట్టణంలోని శ్రీ సత్యసాయి దేవాలయ అభివృద్ధికి ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని చించోడ్ గ్రామానికి చెందిన దేశ్‌ముఖ్ అరుంధతి సోమవారం రూ.1 లక్ష విరాళం అందజేశారు. శ్రీ సత్యసాయి జయంతిని పురస్కరించుకొని దేవాలయంలో కన్వీనర్ శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న అరుంధతి నిర్వాహకులకు విరాళం అందజేశారు.

మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ప్రారంభించండి

మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్

షాద్‌నగర్: ప్రభుత్వం వెంటనే మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సోమవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో ఈ సారి రైతులు ఎక్కువ మంది మొక్కజొన్న పంటను సాగు చేసినట్లు తెలిపారు. దిగుబడి అధికంగా వచ్చే అవకాశం ఉందని, ప్రభుత్వం వెంటనే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతుల నుంచి నేరుగా మొక్కజొన్నలు కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే పంట చేతికి వచ్చిన రైతులు తక్కువ ధరకు దళారులకు అమ్ముకుంటున్నారన్నారు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి సరైన మద్దతు ధర చెల్లించాలన్నారు.

నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలి

మొయినాబాద్: విద్యార్థులు కేవలం పాఠ్యాంశాలకే పరిమితం కాకుండా సృజనాత్మకత, ఆవిష్కరణలు, సామాజిక బాధ్యత, నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలని డైనమిక్ టూల్స్ ప్రైవేట్ లిమిటెడ్ వ్యవస్థాపకుడు జీఆర్ సూర్యరాజే అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని చిలుకూరు రెవెన్యూలో ఉన్న అరిస్టాటిల్ పీజీ కళాశాలలో సోమవారం ఓరియంటేషన్ డే కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు ఎంబీఏ కోర్సు సమయంలో అందుబాటులో ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉన్నత విద్యలో క్రమశిక్షణ, నిబద్ధత, కష్టపడి పనిచేయడం విజయానికి కీలకమైన సూత్రాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల ఆటాపాటలు అందరినీ అలరించాయి. కార్యక్రమంలో ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ ఆర్.నాగేశ్వరరావు, ప్రిన్సిపాల్ ఎల్.శ్రీనివాస్‌రెడ్డి, కేజీరెడ్డి కళాశాల ప్రిన్సిపాల్ సాయి సత్యనారాయణరెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు పోలియో చుక్కలు వేయించాలి

మండల వైద్యాధికారి అన్నపూర్ణ



కనకమామిడిలో చిన్నారులకు పోలియో చుక్కలు వేస్తున్న వైద్యురాలు

మొయినాబాద్‌రూరల్: ఐదు సంవత్సరాల లోపు పిల్లలకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని, చిన్నారుల నిండు జీవితానికి రెండు చుక్క లు రక్ష అని మండల వైద్యాధికారి అన్నపూర్ణ, సీహెచ్‌ఓ వెంకట్‌రెడ్డి అన్నారు. పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా రెండో రోజు కనకమామిడిలో వారు ఇంటింటికీ తిరిగి చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మండలంలో ఇప్పటివరకు 99 శాతం మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేశామని స్పష్టం చేశారు. అక్కడక్కడ మిగిలి ఉన్న బంధువుల ఇంటికి ఇతర ప్రాంతాలకు వెళ్లిన పిల్లలు ఉంటే మంగళవారం కూడా ఇంటింటికీ తిరిగి వేస్తామని, మండల కేంద్రంలోని వైద్యారోగ్య కేంద్రంలో పల్స్ పోలియో కేంద్రం ఉంటుందని తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు విధిగా పోలియో చుక్కలు వేయించాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది, ఆశవర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి స్పందన

ఆమనగల్లు: మండలంలోని ఆకుతోటపల్లి గ్రామ పరిధి గౌరారంలో సోమవారం బొప్పు పల్లి రాకేశ్‌రావ్ ఆధ్వర్యంలో హైదరాబాద్ కామినేని హాస్పిటల్ సహకారంతో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. అవసరమైన వారికి వివిధ ఆరోగ్య పరీక్షలు చేసి, మందులు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు వినోద్‌రెడ్డి, శివ తదితరులు పాల్గొన్నారు.

క్రీడారంగ అభివృద్ధికి పెద్దపీట

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



విజేత జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్: క్రీడారంగ అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేసిందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. దసరా పండుగను పురస్కరించుకొని పట్టణంలోని మినీ స్టేడియంలో ఎమ్మెల్యే పేరిట క్రికెట్ టోర్నీ నిర్వహించారు. ఈ పోటీల్లో గెలుపొందిన జట్టుకు సోమవారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో ఆయన బహుమతులు, ట్రోఫీలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఎంతో మంది ప్రతిభ కలిగిన క్రీడాకారులు ఉన్నారన్నారు. క్రీడాకారులు ఉత్తమ ప్రతిభ కనబర్చి జాతీయ, అంతర్జాతీయ స్థాయికి ఎదగాలన్నారు. గత ప్రభుత్వం క్రీడారంగాన్ని పూర్తిగా విస్మరించిందన్నారు. నియోజకవర్గంలో క్రీడాకారులు, కులాలు, మతాలు, ఇతర వర్గాలు అనే తేడా లేకుండా అందరూ ఒక జట్టు సభ్యులమన్నారు. అదేవిధంగా క్రీడారంగాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందన్నారు. స్టేడియాల నిర్మాణం, క్రీడాకారులకు కావాల్సిన మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తోందన్నారు. ఈ సందర్భంగా టోర్నీలో గెలుపొందిన ఫరూఖ్‌నగర్ జట్టుకు రూ.1 లక్ష నగదు పురస్కారంతో పాటు ట్రోఫీ అందజేశారు. కార్యక్రమంలో నాయకులు కృష్ణారెడ్డి, చెంది తిరుపతిరెడ్డి, పురుషోత్తంరెడ్డి, రఘునాయక్, శ్రీనునాయక్, రవికుమార్ గుప్తా, అన్వర్, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ



సైకిళ్లు అందజేస్తున్న రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సభ్యుడు సత్యనారాయణరెడ్డి

చేవెళ్ల: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు దాతల సహకారాలను సద్వినియోగం చేసుకొని ఉన్నత స్థాయికి చేరుకోవాలని రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సభ్యుడు చింపుల సత్యనారాయణరెడ్డి అన్నారు. మండలంలోని దేవునిఎర్రవల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు రామన్నగూడ నుంచి నడుచుకుంటూ వస్తున్న ఆరు మంది విద్యార్థులకు ఆయన సొంత నిధులతో సైకిళ్లు అందజేశాడు. సోమవారం పాఠశాల వద్ద ఉపాధ్యాయులు, గ్రామస్తులతో కలిసి వాటిని విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేవునిఎర్రవల్లి ప్రభుత్వ పాఠశాలకు పక్కనే ఉన్న రామన్నగూడ వార్డు నుంచి ఆరు మంది విద్యార్థులు నడుచుకుంటూ వస్తున్నారని, రవాణా సౌకర్యం కల్పిస్తే బాగుంటుందని ఉపాధ్యాయులు గ్రామస్తుల దృష్టికి తీసుకొచ్చినట్లు తెలిపారు. విద్యార్థుల సమస్యను గుర్తించి తనవంతు బాధ్యతగా సైకిళ్లు అందించినట్లు స్పష్టం చేశారు. అనంతరం దాత సత్యనారాయణరెడ్డిని గ్రామ నాయకులు, పాఠశాల అభివృద్ధి కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు ప్రత్యేకంగా అభినందించారు. విద్యార్థులు దాత సహకారాన్ని ఎప్పటికీ మరిచిపోలేరన్నారు. కార్యక్రమంలో పాఠశాల అభివృద్ధి కమిటీ ఉపాధ్యక్షుడు కె.శ్రీనివాస్, సభ్యులు రాజిరెడ్డి, శ్రీనివాస్, మల్లారెడ్డి, రవీందర్, రాంరెడ్డి, సత్యనారాయణ, శివయ్య, జంగయ్యగౌడ్, గ్రామ యువకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

షాద్‌నగర్‌రూరల్: ఫరూఖ్‌నగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1989–90లో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు సోమవారం హాజీపల్లి సమీపంలో గల ఓ రిసార్ట్‌లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 35 సంవత్సరాల తర్వాత ఒకచోట కలిసిన వారందరూ ఒకరినొకరూ ఎంతో ఆప్యాయంగా పలకరించుకొని యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. చిన్ననాటి మధుర జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. ఒకే వేదికపై కలుసుకొని అంతులేని సంతోషాన్ని పొందామని, తమ జ్ఞాపకాలు, అనుభవాలను నెమరువేసుకున్నారు. అనంతరం తమతో పాటు చదువుకొని ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్న వారిని ఆదుకోవాలనే ఆలోచనతో ఒక సేవా ట్రస్టును ఏర్పాటు చేయాలని వారు తీర్మానం చేసుకున్నారు.

టపాకాయల దుకాణాలకు అనుమతి తీసుకోవాలి

సీఐ పవన్‌కుమార్‌రెడ్డి



మాట్లాడుతున్న సీఐ పవన్‌కుమార్‌రెడ్డి

మొయినాబాద్‌రూరల్: దీపావళి పండుగ సందర్భంగా మండల, మున్సిపల్ పరిధిలో టపాకాయల దుకాణాలు నెలకొల్పేవారు తప్పనిసరిగా సంబంధిత పోలీస్ అధికారుల అనుమతి తీసుకోవాలని సీఐ పవన్‌కుమార్‌రెడ్డి సూచించారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. తాత్కాలిక టపాకాయల అమ్మకాల కోసం అనుమతులు కోరేవారు తప్పనిసరిగా ఈ నెల 16వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ముందస్తు అనుమతులు లేకుండా దుకాణాలు ఏర్పాటు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రమాణాల ప్రకారం నిబంధనలు పాటించని దరఖాస్తులు తిరస్కరించబడతాయని తెలిపారు. మరిన్ని వివరాల కోసం మొయినాబాద్ పోలీస్‌స్టేషన్‌ను సంప్రదించవచ్చన్నారు. టపాకాయల దుకాణాలు ఏర్పాటు చేసేవారు నిబంధనలను పాటించాలని తెలిపారు.

ఆరోగ్యంపై దృష్టి అవసరం

జిమ్స్ డాక్టర్ రఘురామ్



గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు

నందిగామ: ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని జిమ్స్ డాక్టర్ రఘురామ్ అన్నారు. మండల పరిధిలోని మామిడిపల్లిలో సింబయాసిస్ అంతర్జాతీయ యూనివర్సిటీ సహకారంతో జిమ్స్ వైద్యకళాశాల, ఆస్పత్రి ఆధ్వర్యంలో సోమవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు రఘురామ్, విరాజ్‌కుమార్ గ్రామస్తులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. ఆప్తామాలజీ, ఆర్థోపెడిక్, పెథ్రాలజీ, గైనకాలజీ తదితర పరీక్షలు నిర్వహించారు. దీంతో పాటు షుగర్, బీపీ, పల్స్ బరువు పరీక్షలు చేశారు. 110 మంది రోగులను పరీక్షించి మందులు అందజేసినట్లు వారు తెలిపారు. ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్య సంరక్షణకు పాటు పడాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్లు కార్తిక, కృష్ణ, ప్రసన్న, జిమ్స్ వైద్య బృందం సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

దాతల సహకారం అభినందనీయం

హెచ్‌ఎం మల్లేశ్‌గౌడ్



ఉపాధ్యాయులకు క్రీడాసామగ్రి అందజేస్తున్న ఫౌండేషన్ ప్రతినిధి దామోదర్‌రావు

షాబాద్: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు దాతలు అందించే సహకారం అభినందనీయమని హెచ్‌ఎం మల్లేశ్‌గౌడ్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని ఎల్గొండగూడ ప్రాథమిక పాఠశాలకు స్పోర్ట్స్ కోచింగ్ ఫౌండేషన్ హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో పలు క్రీడా సామగ్రి అందజేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ ప్రతినిధి, బాస్కెట్ బాల్ ఇంటర్నేషనల్ ప్లేయర్ దామోదర్‌రావు వాలీబాల్ పోల్స్, కిట్, బాస్కెట్ బాల్‌పోల్, కిట్, ఖోఖో పోల్స్, స్పీకింగ్ పోడియం, ప్రైజ్ పోడియం, ఫస్ట్ ఎయిడ్ కిట్, క్రికెట్, ఇతర స్పోర్ట్స్ మెటీరియల్‌ను పాఠశాల సిబ్బందికి అందజేశారు. అనంతరం హెచ్‌ఎం మాట్లాడుతూ.. క్రీడలు మానసికోల్లాసంతో పాటు శారీరక దృఢత్వానికి ఎంతో దోహదపడుతాయన్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు రవీందర్‌రెడ్డి, ఆంజనేయులుగౌడ్, యాదయ్య, శ్రీనివాస్‌చారి, మల్లారెడ్డి, శ్రీనివాస్, నరేందర్‌రెడ్డి, మురళీ, సతీష్, రవి, రాఘవేందర్, విఠల్‌రెడ్డి, గ్రామస్తులు, విద్యార్థులు ఉన్నారు.

మైనార్టీలను విస్మరిస్తున్న ప్రభుత్వం

కాంగ్రెస్ పార్టీ మండల మైనార్టీ నాయకులు అజీమ్, సలీమ్



మాట్లాడుతున్న మైనార్టీ నాయకులు

చేవెళ్ల: కాంగ్రెస్ పార్టీ కోసం కష్టపడి పనిచేసిన మైనార్టీలకు పార్టీలో గుర్తింపు లేకుండా పోయిందని మైనార్టీ మండల ఉపాధ్యక్షుడు అజీమ్, ప్రధాన కార్యదర్శి సలీమ్ అన్నారు. చేవెళ్లలో సోమవారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ మండలంలో మైనార్టీలను మరిచిపోయిందన్నారు. చేవెళ్లలో పార్టీ సమావేశం జరిగినా మండల నాయకులకే సమాచారం ఇవ్వలేదని ఆరోపించారు. గతంలో కూడా ఎలాంటి పార్టీ కార్యక్రమాలకు నాయకులు మైనార్టీలకు సమాచారం ఇవ్వలేదన్నారు. అధికారంలోకి రాక ముందు పార్టీకోసం కలిసిమెలిసి పనిచేసి పార్టీని బలోపేతం చేశామన్నారు. కానీ మండలంలో కాంగ్రెస్ పార్టీ సమావేశాలకు గాని, పార్టీ కార్యక్రమాలకు మైనార్టీలకు ఎలాంటి సమాచారం ఇవ్వటం లేదన్నారు. పార్టీలోకి వలస వచ్చిన నాయకులు, పార్టీ కోసం పని చేసే వారిని కూడా అధిష్ఠానం గుర్తించడం లేదన్నారు. అందుకే మండలంలోని మైనార్టీలను అంతా ఏకం చేసి కాంగ్రెస్‌ను వీడి బీఆర్‌ఎస్ పార్టీలోకి వెళ్లాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. మండలంలోని మైనార్టీలందరితో సమావేశం నిర్వహించి అంతా కలిసి త్వరలోనే బీఆర్‌ఎస్ పార్టీలో చేరుతామని స్పష్టం చేశారు.

గాలికుంటు టీకాలు తప్పనిసరి

- రేపటి నుంచి నవంబర్ 15వ తేదీవరకు టీకాల పంపిణీ
- రేగడిదోస్వాడ పశువైద్యాధికారి చంద్రశేఖర్‌రెడ్డి



మాట్లాడుతున్న డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి

షాబాద్: పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు రైతులు తప్పకుండా వేయించుకోవాలని పశువైద్యాధికారి చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని రేగడిదోస్వాడ పశువైద్యశాలలో సిబ్బందితో ఆయన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 15వ తేదీ నుంచి నవంబర్ 15 వరకు మండలంలోని అన్ని గ్రామాల్లో పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేయనున్నట్లు స్పష్టం చేశారు. పశువులకు వ్యాధి సోకితే నోట్లో, గిట్టల్లో పుండ్లు అయి జ్వరంతో మేతమేవని, పాడి పశువుల్లో పాల దిగుబడి తగ్గుతుందని, అలాగే ఎడ్లు, దున్నపోతులు మేతమేయక అనారోగ్యంతో చివరకు చనిపోతాయని తెలిపారు. రైతులు తమ పశువులకు గాలికుంటు నివారణ టీకాలు తప్పక వేయించాలని సూచించారు. వచ్చే నెల 15వ తేదీవరకు అన్ని గ్రామాల్లో పశువులకు టీకాలు వేస్తామని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది తదితరులు ఉన్నారు.

రేపటి నుంచి పశువులకు టీకాలు

మొయినాబాద్: ఈ నెల 15 నుంచి నవంబర్ 14 వరకు అన్ని గ్రామాల్లో గాలికుంటు వ్యాధి నివారణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు మండల పశువైద్యాధికారి అహ్మద్ తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాలతో పాటు మున్సిపాలిటీ పరిధిలో ఉన్న ఆవులు, గేదెలు, మేకలు, గొర్రెలకు టీకాలు వేయించాలని సూచించారు. వ్యాధి సోకిన పశువులకు నోరు, నాలుక, పాదాల వద్ద పుండ్లు, ఉమ్మికారడం, ఆహారం తినకపోవడం, పాల ఉత్పత్తి తగ్గిపోవడం వంటి లక్షణాలు కనిపిస్తాయన్నారు. ఈ వ్యాధి నివారణకు తప్పనిసరిగా టీకాలు వేయించాలన్నారు. 15న మున్సిపాలిటీ పరిధిలోని సురంగల్‌లో టీకాల కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. పాడి రైతులు, పశువుల కాపర్లు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఎంపీ నిధులతోనే అభివృద్ధి పనులు

మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం



సీసీరోడ్డు పనులను ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం, నాయకులు

చేవెళ్ల: గతంలో ఎప్పుడు లేని విధంగా ఎంపీ నిధులతో గ్రామాల్లో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం అన్నారు. మండలంలోని చనువెళ్లి, ఇక్కారెడ్డిగూడ, అల్లవాడ, పలుగుట్ట గ్రామాల్లో సోమవారం ఎంపీ నిధులతో చేపడుతున్న సీసీరోడ్డు పనులను స్థానిక బీజేపీ నాయకులతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎంపీ నిధులు ఉంటాయనే విషయం గతంలో ఎప్పుడు ప్రజలకు తెలిసేదికాదని, కానీ ప్రజా నాయకుడు కొండా విశ్వేశ్వర్‌రెడ్డి ఎంపీగా గెలిచిన తర్వాత ఆయన తన ఎంపీ పరిధిలో వచ్చే నిధులను అన్ని గ్రామాలకు కేటాయిస్తూ గ్రామాల అభివృద్ధికి సహకరిస్తున్నారన్నారు. పార్లమెంట్ పరిధిలోని ఆయా నియోజకవర్గాలకు అందించే నిధులతో పాటు చేవెళ్ల నియోజకవర్గంలోని గ్రామాలకు ప్రాధాన్యత కల్పిస్తున్నారని వివరించారు. ఈ నిధులతో గ్రామాల్లో ఉన్న సమస్యలు పరిష్కారమవుతున్నాయని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి



ర్యాలీ నిర్వహిస్తున్న ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు

వైస్ ప్రిన్సిపాల్ కళాజ్యోతి

షాద్‌నగర్‌రూరల్: ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పరిసరాల పరిశుభ్రత పాటించాలని గిరిజన సంక్షేమ గురుకుల డిగ్రీ, పీజీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ కళాజ్యోతి అన్నారు. ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని కమ్మదనంలో గిరిజన గురుకుల డిగ్రీ, పీజీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ అఫోజ్‌జహాన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రత్యేక శీతాకాల శిబిరం(ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం) సోమవారం మూడో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు గ్రామంలో స్వచ్ఛతపై ర్యాలీ నిర్వహించారు. ఫ్లకార్డులను ప్రదర్శిస్తూ గ్రామస్తులకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి హాజరైన కళాజ్యోతి మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. చిన్నపాటి అనారోగ్యానికి గురైనా వెంటనే సమీపంలో వైద్యులను సంప్రదించి వైద్యసేవలను పొందాలన్నారు. మహిళలు బ్రెస్ట్ కేన్సర్ నివారణపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. పోషక విలువలు కలిగిన ఆహారాన్ని తీసుకుంటే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందన్నారు. సేవా దృక్పథంతో ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు సేవా కార్యక్రమాలలో భాగస్వాములు కావడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, గ్రామపెద్దలు, ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

కేఎల్‌హెచ్ యూనివర్సిటీ స్టార్టప్స్‌కి రూ.19 లక్షలు



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ రామకృష్ణ

మొయినాబాద్: మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని అజీజ్‌నగర్‌లో ఉన్న కేఎల్‌హెచ్ యూనివర్సిటీ విద్యార్థులు చేపడుతున్న ఏడు స్టార్టప్స్‌కు ఐఐటీ హైదరాబాద్ టీఐహన్‌–ఐ హబ్ నుంచి రూ.19 లక్షల నిధులు లభించాయి. యూనివర్సిటీ విద్యార్థులు ఆరోగ్య రంగం, రోబోటిక్స్, డ్రోన్ టెక్నాలజీ, ట్రాఫిక్ మేనేజ్‌మెంట్, ఇంటెలిజెంట్ ఎలక్ట్రానిక్ సిస్టమ్స్ వంటి రంగాల్లో చేపడుతున్న కొత్త ఆవిష్కరణలను ప్రోత్సహించడానికి టీఐహన్‌–ఐ హబ్ ఈ నిధులను మంజూరు చేసిందని యూనివర్సిటీ ప్రిన్సిపాల్ రామకృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా ఆవిష్కరణలు చేపడుతున్న విద్యార్థులను అభినందించారు.

ప్రమాదాల నివారణకు సహకరించాలి

ఎస్‌ఐ శిరీష



వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్‌ఐ శిరీష, సిబ్బంది

చేవెళ్ల: వాహనదారులు ట్రాఫిక్ రూల్స్ పాటించి రోడ్డు ప్రమాదాల నివారణకు సహకరించాలని ఎస్‌ఐ వనం శిరీష అన్నారు. మండల కేంద్రంలోని చౌరస్తాలో సోమవారం సాయంత్రం వాహనాల తనిఖీలు నిర్వహించి, ట్రాఫిక్ రూల్స్‌పై వాహనదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ రూల్స్ పాటించాలని సూచించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కారులో ప్రయాణించే వారు సీటు బెల్టులు వేసుకోవాలన్నారు. వాహనాలకు సంబంధించి అన్ని రకాల పత్రాలు తప్పనిసరిగా కలిగి ఉండాలని సూచించారు. డ్రైవింగ్ లైసెన్స్‌లు లేకుండా, మద్యం సేవించి వాహనాలు నడిపించటం చట్టరీత్యా నేరమన్నారు. అలాంటి వారికి శిక్షలు తప్పవని హెచ్చరించారు. మైనర్లకు ఎట్టి పరిస్థితుల్లో తల్లిదండ్రులు వాహనాలు ఇవ్వకూడదని సూచించారు. ఆర్టీసీ బస్సుల్లో ఫుట్‌బోర్డుపై ప్రయాణం చేసే వారిని గుర్తించి బస్సులు ఆపి వారికి కౌన్సెలింగ్ ఇచ్చి పంపించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది ఉన్నారు.

నేడు వాహనదారులకు కౌన్సెలింగ్

ట్రాఫిక్ పోలీస్ కేసులలో పట్టుబడిన వాహనదారులకు చేవెళ్ల ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో కౌన్సెలింగ్ కేంద్రం అందుబాటులో ఉంటుందని, దీనిని కేసులు నమోదైన వారు సద్వినియోగం చేసుకోవాలని ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సతీశ్ సూచించారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మద్యం సేవించి, డ్రైవింగ్ లైసెన్స్‌లు లేకుండా పట్టుబడిన కేసుల వాహనదారులు టీటీఐ మాదాపూర్ కౌన్సెలింగ్ కేంద్రాలకు వెళ్లి రావాల్సి ఉంటుందన్నారు. కానీ మంగళవారం ఈ కౌన్సెలింగ్ కేంద్రాన్ని చేవెళ్ల ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో టీటీఐ మాదాపూర్ నుంచి సిబ్బంది వచ్చి నిర్వహిస్తున్నారని తెలిపారు. కేసులలో పట్టుబడిన వారికి ఈ అవకాశం కల్పిస్తున్నట్లు, ఒక్కరోజే ఈ కౌన్సెలింగ్ సిబ్బంది ఉంటారని తెలిపారు. కేసులు ఉన్న వాహనదారులు ఈ కేంద్రాన్ని ఉపయోగించుకోవాలని కోరారు.

రోడ్లపై వ్యాపారాలు నిర్వహిస్తే కఠిన చర్యలు

మున్సిపల్ మేనేజర్ అంజన్‌కుమార్



ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కల్పిస్తున్న అధికారి ఆనంద్

శంకర్‌పల్లి: వ్యాపారస్తులు రోడ్లపై బండ్లు పెట్టుకొని వ్యాపారాలు నిర్వహిస్తే కఠిన చర్యలు ఉంటాయని మున్సిపల్ అధికారులు స్పష్టం చేశారు. సోమవారం పట్టణ చౌరస్తాలో మున్సిపల్ మేనేజర్ అంజన్‌కుమార్, పారిశుద్ధ్య నిర్వహణాధికారి ఆనంద్ ఆధ్వర్యంలో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రోడ్లపై వ్యాపారం చేస్తే పెద్దఎత్తున ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. అదేవిధంగా ప్లాస్టిక్ నిషేధం అమలులో ఉన్నందున సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను ఎవరూ వాడొద్దని హెచ్చరించారు. ప్రభుత్వ నిబంధనలు అతిక్రమించిన వారిపై చట్టపరమైన చర్యలతో పాటు భారీఎత్తున జరిమానా విధిస్తామన్నారు. కార్యక్రమంలో వార్డు ఆఫీసర్లు, సిబ్బంది పాల్గొన్నారు.